సాక్షి
రాజన్న సిరిసిల్ల

శనివారం | 5 ఏప్రిల్ | 2025



రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలి

సిరిసిల్లటౌన్: అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలని కోరుతూ డీడబ్ల్యూవో లక్ష్మీరాజంకు వినతిపత్రం అందించారు.



27న రజతోత్సవ సభ

గంభీరావుపేట: వరంగల్‌లో 27న నిర్వహించే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కోరారు. ప్రచార పోస్టర్‌లు ఆవిష్కరించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0/24.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. కానీ అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వేగంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

వైద్యసేవలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- డీఎంహెచ్‌వో రజిత



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

చందుర్తి(వేములవాడ): నిరుపేదల వైద్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో రజిత హెచ్చరించారు. స్థానిక పీహెచ్‌సీని శుక్రవారం డీఎంహెచ్‌వో రజిత, రాష్ట్ర ఎన్సీడీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ సత్యేంద్రనాథ్ తనిఖీ చేశారు. డాక్టర్ సత్యేంద్రనాథ్ మాట్లాడుతూ సంక్రమిత వ్యాధిగ్రస్తుల వివరాలను ఎన్‌సీడీ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సంపత్‌కుమార్, సీహెచ్‌వోలు సత్యనారాయణ, బాలచంద్రం, చందుర్తి వైద్యాధికారి వేదాచారి పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఎస్జీటీలుగా నియామకంపై హర్షం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సిరిసిల్ల: 2008 డీఎస్సీ మెరిట్ అభ్యర్థులను కాంట్రాక్ట్ ఎస్జీటీలుగా నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. కలెక్టరేట్ గేట్ వద్ద శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుతవిప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

సన్మార్గంలో పయనించాలి

- శ్రీతుకారాం మహారాజ్



పాండురంగా బృందానికి సన్మానం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రతి ఒక్కరు భక్తిమార్గాన్ని ఎంచుకుని సన్మార్గంలో పయణించాలని శ్రీతుకారాం మహారాజ్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలోని సత్సంగ సదనంను బైరాపూర్‌లోని పాండురంగ ఆశ్రమం నుంచి శ్రీతుకారాం మహారాజ్, లక్ష్మణ్ మహారాజ్ బృందం శుక్రవారం సందర్శించారు. సత్సంగ సదనం తరపున ద్యావ దేవయ్య బృందం సన్మానించారు. తుకారాం మహారాజ్ మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతోపాటు పుణ్యక్షేత్రాలను సందర్శించి భగవంతుని కృపకు పాత్రులు కావాలన్నారు. సత్సంగ సదనం భక్త బృందం సభ్యులు పద్మక్క, శ్యామలక్క, బండారి బాల్‌రెడ్డి, గుర్రపు రాములు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.50వేల సాయం

- చెక్కు అందజేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



రూ.50వేల చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే

బోయినపల్లి(చొప్పదండి): మండల కేంద్రానికి చెందిన టేకు పద్మ–శంకరయ్యల పూరి గుడిసె గురువారం షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన విషయం తెలిసిందే. వీరికి ప్రభుత్వం తరపున రూ.50వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేతుల మీదుగా అందజేశారు. తహసీల్దార్ కాలె నారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్‌యాదవ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, భీంరెడ్డి మహేశ్‌రెడ్డి, కట్ట లచ్చయ్య ఉన్నారు.

మెగా జాబ్‌మేళాకు స్పందన



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. 120 మంది ఇంటర్వ్యూకు హాజరుకాగా 45 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్రవణ్‌కుమార్, కంపెనీల ప్రతినిధుల చేతుల మీదుగా నియామకపత్రాలు అందించారు.

మానేరుతీరం.. ఆధ్యాత్మిక శోభితం

- 6న శ్రీసీతారాముల కల్యాణం
- ముస్తాబైన ఆలయాలు
- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు
- భారీగా తరలిరానున్న భక్తులు

రాజన్నసిరిసిల్ల జిల్లా ఆధ్యాత్మిక జరిలో ఓలలాడుతోంది. ఏ పల్లెకు పోయిన సీతారాముల కల్యాణోత్సవాలకు ముస్తాబవుతున్న ఆలయాలే కనిపిస్తున్నాయి. మానేరుతీరంలోని గ్రామాల్లో సందడి మరింత ఎక్కువగా ఉంది. ఇప్పటికే రాజన్న ఆలయంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవాల్లో భాగంగా రోజుకో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్, కోనరావుపేట మండలం మామిడిపల్లి, ఇల్లంతకుంట మండలం రామాజీపేటల్లోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాల్లో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 6న కల్యాణోత్సవానికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎనిమిది రోజుల పాటు జిల్లా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మారుమోగనుంది.



మామిడిపల్లిలోని సీతారామచంద్రస్వామి ఆలయం

మామిడిపల్లి మహిమాన్వితం

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మామిడిపల్లిలోని వేములవాడ రాజన్న దత్తత శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఏటా శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. శనివారం నుంచి బ్రహ్మోత్సవాలు మొదలవుతున్నాయి. ఇందుకోసం రాజన్న ఆలయ అధికారుల పర్యవేక్షణలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలకు కోనరావుపేట, సిరిసిల్ల, వేములవాడతోపాటు భీంగల్, సిరికొండ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. కల్యాణానికి హాజరైన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయ ఇన్‌చార్జి నరేందర్ తెలిపారు. మామిడిపల్లి ఆలయంలో ఈనెల 5న ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు 13వ తేదీతో ముగుస్తాయి. 6న శ్రీసీతారాముల కల్యాణం, 13న రథోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతాయి.



సీతారామచంద్రస్వామి ఆలయంలోని విగ్రహాలు



శ్రీసీతారామచంద్రస్వామి విగ్రహాలు



వేడుకలకు హాజరైన భక్తులు

500 ఏళ్ల నాటి ఆలయం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని వేములవాడ రాజన్న దత్తత శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. నారాయణపూర్‌లోని శ్రీసీతారామాలయం 500 ఏళ్ల క్రితం నాటిదని స్థల పురాణాలు చెబుతున్నాయి. కోరిన కోరికలు తీరుతాయని భక్తుల విశ్వాసం. స్వామి వారి బ్రహ్మోత్సవాలకు హైదరాబాద్‌లో స్థిరపడ్డ గ్రామస్తులు హాజరవుతుండడం విశేషం. భద్రాచలంలోని ఆలయంలో మాదిరిగానే ఇక్కడ పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ భూముల ద్వారా వచ్చే ఆదాయంతోపాటు వేములవాడ రాజన్న ఆలయం ద్వారా వచ్చే నిధులతో నిత్య కైంకర్యాలు, ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈనెల 4 నుంచి 9 వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. 6న కల్యాణోత్సవం, 9న రథోత్సవం నిర్వహించనున్నారు.




శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం

60 ఏళ్లుగా కల్యాణోత్సవం



ఆలయంలోని విగ్రహాలు



భారీ ఆంజనేయ విగ్రహం

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని రామాజీపేట శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. 60 ఏళ్లుగా ఆలయంలో సీతారామ కల్యాణోత్సవం నిర్వహిస్తున్నారు. గజ్వేల్ పట్టణానికి చెందిన రుక్మాంబట్ల విధు మౌలిశాస్త్రీ ఈ ఆలయాన్ని 1964లో నిర్మించారు. ఉత్సవమూర్తులను జైపూర్ నుంచి తెప్పించారు. ఏటా జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు సిద్దిపేట జిల్లా నుంచి భక్తులు తరలివస్తారు. ఆలయానికి సమీపంలోనే ఉన్న అంజన్నకొండపై 53 ఫీట్ల ఎత్తుగల ఆంజనేయస్వామి విగ్రహం ఆకర్షణీయమంగా ఉంటుంది. మాజీ రాజ్యసభ సభ్యుడు హనుమంతరావు ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసి కొండపైకి సీసీరోడ్డు కూడా వేయించారు.

వివిధ జిల్లాల నుంచి తరలివస్తారు



ఆలయానికి వచ్చే భక్తులకు మహా అన్నదానం నిర్వహిస్తాం. శ్రీరామనవమి నాడు ఉదయం 10 గంటలకు బ్రహ్మోత్సవం జరుగుతుంది. మధ్యాహ్నం 12 గంటలకు శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తాం.

– రుక్మంభట్ల సీతారామశర్మ, ఆలయ నిర్వాహకుడు

సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టొద్దు

- ఆర్వోఎఫ్‌ఆర్ భూసమస్యలు పది రోజుల్లో పరిష్కరించాలి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



కమిషన్ చైర్మన్ వెంకటయ్యకు రాజన్న చిత్రపటాన్ని అందిస్తున్న కలెక్టర్, ఎస్పీలు

సిరిసిల్ల: జిల్లాలో షెడ్యూల్ కులాలు, తెగల అభివృద్ధికి మంజూరయ్యే ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టకుండా చూడాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కోరారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబునాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, కుశ్రము నీలాదేవి, రేణిగుంట్ల ప్రవీణ్, జిల్లా శంకర్‌లతో కలిసి కలెక్టరేట్‌లో శుక్రవారం సమీక్షించారు. కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో 4,313 ఎకరాల భూమికి సంబంధించి 6,029 మంది రైతులు పోడుపట్టాలకు దరఖాస్తు చేసుకోగా 1,614 మందికి 2,860 ఎకరాలు పంపిణీ చేశారన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆర్వోఎఫ్‌ఆర్ భూసమస్యను పది రోజుల్లో పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలకు రూ.1.08 కోట్లు సింగరేణి నుంచి రావాలని అధికారులు వివరించగా.. సీఎండీతో మాట్లాడుతామని స్పష్టం చేశారు. సబ్సిడీ రుణాలను మంజూరు చేసి యూనిట్లు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరణాలు లేకుండా మాతా శిశు ఆసుపత్రిలో ప్రసవాలను విజయవంతంగా నిర్వహించడంపై చైర్మన్ జిల్లా అధికార యంత్రాంగాన్ని అభినందించారు.

సోలార్ ప్యానల్ ఫెన్సింగ్‌లకు ప్రతిపాదించండి

స్కూళ్లు, హాస్టళ్లలో పిల్లల రక్షణకు కుక్కలు, కోతుల సమస్య పరిష్కారానికి సోలార్ ప్యానల్ ఫెన్సింగ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఏడు రోజుల్లో సిద్ధం చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో డైట్‌మెనూ అందించాలని, స్టడీసర్కిల్‌లో విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించాలన్నారు. స్వయం ఉపాధి కల్పనలో రాజీవ్ యువవికాసం ద్వారా ఎస్సీ, ఎస్టీ యువతకు రుణాలు అందించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ స్టడీ సర్కిల్ కోసం నిధుల మంజూరుకు కృషి చేస్తామని వివరించారు.

అట్రాసిటీ కేసుల్లో..

మూడేళ్లలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీపై 233 ఫిర్యాదులు రాగా 233 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని, 136 చార్జిషీట్ దాఖలు చేశామని అధికారులు వివరించారు. జిల్లాలో పెండింగ్ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అట్రాసిటీ కేసుల్లో చార్జిషీట్ దశలో 57 మందికి రూ.1.28 లక్షల పరిహారం చెల్లించామని, ఇంకా మిగిలిన 194 మంది బాధితులకు చెల్లించాల్సిన రూ.1.45 కోట్లు త్వరగా మంజూరు చేసేలా శ్రద్ధ చూపాలన్నారు. ఉపాధిహామీలో ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం పని కల్పించాలని కోరారు. అనంతరం జిల్లాలో వివిధ శాఖల ద్వారా అమలు చేసుతున్న ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ వివరించారు. ఎస్సీ స్టడీ సర్కిల్ కోసం భూమి కేటాయించామని.. భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరారు. ఎస్పీ మహేశ్ బీ.గీతే, వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, సిరిసిల్ల ఆర్డీవో రాధాభాయి, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

5 లక్షల మందికి సన్నబియ్యం

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

సిరిసిల్ల: జిల్లాలో ఐదు లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సన్నబియ్యం పంపిణీపై పౌరసరఫరాల అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 345 దుకాణాల ద్వారా 1,73,578 రేషన్‌కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెలా 3,275 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని స్పష్టం చేశారు. అంతకుముందు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.వసంతలక్ష్మి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ పి.రజిత పాల్గొన్నారు.

అర్హులకు రేషన్‌కార్డులు జారీ చేయాలి

- అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్



సిరిసిల్ల: జిల్లాలో అర్హులకు రేషన్‌కార్డు జారీ చేయాలని అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్ కోరారు. కలెక్టరేట్ నుంచి శుక్రవారం పౌరసరఫరాల అధికారులతో కలిసి టెలీకాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. జిల్లాలో ప్రజాపాలన, మీసేవ, ఇతర మార్గాల ద్వారా రేషన్‌కార్డులకు వచ్చిన 30,977 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని, వాటిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని సూచించారు. దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారి జాబితాను రూపొందించాలని, వాటిపై గ్రామస్తుల నుంచి అభ్యంతరాలు తీసుకుని వాటిని తుది జాబితాను గ్రామసభల ద్వారా ఆమోదింపచేసుకుని రేషన్‌కార్డు జారీచేయాలన్నారు. సిరిసిల్ల ఆర్డీవో రాధాభాయి, డీసీఎస్‌వో పి.వసంతలక్ష్మి పాల్గొన్నారు.



ఖాళీ బిందెలతో నిరసన

ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలో శుక్రవారం తాగునీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో ధర్నా చేపట్టారు. సిద్దిపేట, కామారెడ్డి ప్రధాన రహదారిపైకొచ్చి నిరసన తెలిపారు. స్థానిక 8, 9, 10వ వార్డుల్లో తాగునీటి కొరత తీవ్రంగా ఉందన్నారు. ఏఎస్సై శ్రీనివాస్, పంచాయతీ ఈవో లక్ష్మణ్ అక్కడికి చేరుకొని సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

ఐక్యతతోనే ముదిరాజ్‌లకు రాజ్యాధికారం

- బీసీ–ఏ'లోకి మార్చేలా ప్రభుత్వం కృషి
- త్వరలోనే పరేడ్‌గ్రౌండ్‌లో భారీ సభ
- కాంగ్రెస్ మెదక్ ఇన్‌చార్జి నీలం మధుముదిరాజ్
- ముస్తాబాద్‌లో ఆత్మీయ సభ



మాట్లాడుతున్న నీలం మధుముదిరాజ్

ముస్తాబాద్(సిరిసిల్ల): రాష్ట్రంలోని బీసీ కులాలతోపాటు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సబ్బండ వర్గాలతో కలిసి ఐక్యంగా పనిచేసి ముదిరాజ్‌లు రాజ్యాధికారం సాధించుకోవాలని కాంగ్రెస్ మెదక్ ఇన్‌చార్జి, ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ కోరారు. ముస్తాబాద్ మాతృశ్రీ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం నిర్వహించిన ముదిరాజ్‌ల ఆత్మీయ సమావేశానికి హాజరై మాట్లాడారు. కొన్ని పార్టీలు ముదిరాజ్‌లను అవమానించాయని, అలాంటి వారికి ఎన్నికల్లో బుద్ధి చెప్పామన్నారు. తెలంగాణలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజ్‌లకు ఇరవై మంది ఎమ్మెల్యేలను గెలిపించుకునే సత్తా ఉందన్నారు. ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి 'ఏ'లోకి మార్చేందుకు సిద్దిపేట ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ అని, ముదిరాజ్‌లను బీసీ–ఏలోకి మార్చేందుకు కృషి చేస్తామన్నారు. బీసీ–ఏలోకి మార్చాక సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో భారీ సభ పెడతామన్నారు. ముదిరాజ్ విద్యార్థులను ఉన్నత చదువులకు తీసుకెళ్లేందుకు సహకారం అందిస్తామని తెలిపారు. ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, మత్స్యకార సొసైటీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రం, బీసీ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు పర్శ హన్మాండ్లు, డైరెక్టర్లు గాడిచర్ల దేవయ్య, ముచ్చర్ల శ్రీను, మండలాధ్యక్షుడు పిట్ల రాంగోపాల్, జెల్ల వెంకటస్వామి, గజ్జెల రాజు, మామిండ్ల భూపతి, విఠల్, పిట్టల రవీందర్, పాండు, గొడుగు శంకర్, గీస భిక్షపతి, జాల భిక్షపతి, జింక మల్లేశ్, రంజాన్ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

అసమర్థ కాంగ్రెస్‌పై పోరాడుతాం

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్



మాట్లాడుతున్న ఎన్వీ సుభాష్

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలో అసమర్థపాలన సాగిస్తున్న కాంగ్రెస్‌పై పోరాటం చేపడతామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ పేర్కొన్నారు. సిరిసిల్లలో శుక్రవారం నిర్వహించిన జిల్లా కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేలా ఉద్యమ కార్యాచరణ రూపొందించి ముందుకెళ్లాలని జిల్లా నేతలకు సూచించారు. ఏప్రిల్ 6న బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంస్థాగతంగా చేయాల్సిన కార్యక్రమాలపై వివరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు, కార్యవర్గ సభ్యులు అల్లాడి రమేశ్, కుమ్మరి శంకర్, మ్యాన రాంప్రసాద్, రేగుల మల్లికార్జున్, రవీందర్, దశరథం, రాగుల రాజిరెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, చంటి మహేశ్, కోనేటి సాయిల్, శీలం రాజు, నాగుల శ్రీనివాస్, బర్కం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్మికసంఘాలతో అధికారుల చర్చలు విఫలం

- శ్రీరామనవమి తరువాత సంయుక్త చర్చలు



కలెక్టరేట్‌లో పవర్‌లూమ్ కార్మిక సంఘాల నాయికులతో అధికారుల చర్చలు

సిరిసిల్ల: పవర్‌లూమ్ కార్మికసంఘాల నాయకులతో చేనేత, జౌళిశాఖ, కార్మిక శాఖ అధికారులు శుక్రవారం చేపట్టిన చర్చలు విఫలమయ్యాయి. నాలుగు రోజులుగా సిరిసిల్లలో నేతకార్మికులు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కార్మిక నాయకులతో అధికారులు కలెక్టరేట్‌లో చర్చలు నిర్వహించారు. పాలిస్టర్ వస్త్రోత్పత్తిలో 2018 నాటి పాతకూలీని ఇస్తున్నారని, కొత్త కూలీ ఒప్పందం చేసుకోకుండా శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని కార్మికసంఘాల నాయకులు వివరించారు.పాతకూలీతో కార్మికులు నష్టపోతున్నారని, 2023 నాటి బతుకమ్మ చీరలకు సంబంధించిన కార్మికులకు రావాల్సిన 10 శాతం యారన్ సబ్సిడీ డబ్బులు ఇవ్వాలని కోరారు. వార్పిన్, వైపని కార్మికులకు కూలీ పెంచాలని, మహిళాశక్తి చీరల ఆర్డర్ల కూలీ రేట్లను ముందు ప్రకటించాలని కోరారు. చేనేత జౌళిశాఖ అభివృద్ధి అధికారి రవీందర్‌రెడ్డి వస్త్రోత్పత్తిదారులతో మాట్లాడి కూలీ సమస్యను పరిష్కరిస్తామని, మహిళాశక్తి చీరల కూలీ రేట్లు వారం, పది రోజుల్లో నిర్ణయిస్తామన్నారు. బతుకమ్మ చీరల 10 శాతం యారన్ సబ్సిడీ డబ్బులకు సంబంధించి తుది నివేదిక సిద్ధమైందని పనిచేసిన కార్మికుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమవుతాయని వివరించారు. ప్రస్తుతం 90 నుంచి 150 కార్ఖానాలు విద్యుత్ బిల్లుల సమస్యలతో బందున్నాయని.. చర్చల ద్వారానే సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. సమ్మె విరమించి పనిలోకి వెళ్లాలని కోరారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ నజీర్ హైమద్ మాట్లాడుతూ పాలిస్టర్ కూలీ సమస్యపై కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్‌తో సమావేశం ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. చర్చలు విఫలం కావడంతో శ్రీరామనవమి తర్వాత సమావేశం నిర్వహిస్తామని అధికారులు వెల్లడించారు. చర్చల్లో పవర్‌లూమ్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, వార్పిన్, వైపని కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తామని కార్మిక సంఘాల నాయకులు ప్రకటించారు.

నేతకార్మికుల మానవహారం

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ ఆర్డర్లు అయిన మహిళా సంఘాల చీరలు ఉత్పత్తి చేస్తున్న కార్మికుల కూలీ నిర్ణయించాలని కోరుతూ నేతన్నలు చేపట్టిన సమ్మె శుక్రవారం నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు బీవైనగర్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. వారు మాట్లాడుతూ నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. పవర్‌లూమ్స్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, అన్నల్‌దాస్ గణేశ్, సిరిమల్ల సత్యం, కుమ్మరికుంట కిషన్, నక్క దేవదాస్, ఎలిగేటి శ్రీనివాస్, ఒగ్గు గణేశ్, జగదీశ్, గుండు రమేశ్, బెజుగం సురేశ్, శ్రీధర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సన్న, దొడ్డు వడ్లను వేరుగా సేకరించాలి

- డీఆర్‌డీవో శేషాద్రి



మాట్లాడుతున్న డీఆర్‌డీవో శేషాద్రి

సిరిసిల్ల: జిల్లాలో ఇందిర క్రాంతి పథం(ఐకేపీ) ద్వారా కొనుగోలు చేసే ధాన్యాన్ని సన్న వడ్లు, దొడ్డు వడ్లను వేర్వేరుగా సేకరించాలని డీఆర్‌డీవో శేషాద్రి పేర్కొన్నారు. సిరిసిల్ల పద్మనాయక కల్యాణ మండపంలో శుక్రవారం మహిళా సంఘాల ప్రతినిధులు, ఐకేపీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 191 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నామన్నారు. సేకరించిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. మద్దతు ధరతోపాటు సన్నవడ్లకు అదనంగా రూ.500 బోనస్‌ను ప్రతీ క్వింటాలుకు చెల్లిస్తారని వివరించారు. అదనపు డీఆర్‌డీవో గొట్టె శ్రీనివాస్, డీపీఎం సుధారాణి, శ్రీనివాస్, పౌరసరఫరాల శాఖ అధికారి రాజశేఖర్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

సిరిసిల్లక్రైం: జిల్లా కేంద్రంలోని అంబికానగర్‌కు చెందిన చింతకుంట దుర్గాప్రసాద్(25) శుక్రవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతిని తండ్రి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తన కుమారుడికి ఎవరితోనూ గొడవలు లేవన్నారు. ఇటీవల డిగ్రీ పూర్తి చేసి పై చదువులు, గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్నాడని వివరించాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడని రోదించాడు. కుమారుడి మృతితో తల్లి లత కన్నీరుమున్నీరుగా విలపించింది.

వృద్ధురాలు..



మల్లవ్వ(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): అనారోగ్య సమస్య భరించలేక ఓ వృద్ధురాలు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాలు. మండలంలోని బందనకల్‌కు చెందిన పాతూరి మల్లవ్వ(54) ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురైంది. నెల రోజుల క్రితం సిద్దిపేటలోని ఓ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నా ఆరోగ్యం కుదుట పడలేదు. ఈక్రమంలోనే భర్త రాంరెడ్డితో కలిసి శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లింది. భర్త పశువులకు మేత వేసేందుకు వెళ్లగా.. అదే సమయంలో మల్లవ్వ అక్కడే ఉన్న చెట్టుకు తాడుతో ఉరివేసుకుంది. భర్త తిరిగి వచ్చి చూసేసరికి మల్లవ్వ విగతజీవిగా చెట్టుకు వేలాడడంతో షాక్‌కు గురయ్యాడు. భర్త ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నీట మునిగి వ్యక్తి మృతి

జగిత్యాలక్రైం: వ్యవసాయబావిలో మునిగిన పంప్‌సెట్‌ను తీసుకువచ్చేందుకు వెళ్లిన వ్యక్తి మృతిచెందిన సంఘటన జగిత్యాల రూరల్ మండలం అంతర్గాంలో చోటుచేసుకుంది. చెన్నవేని గంగాధర్ వ్యవసాయబావిలో విద్యుత్ మోటారు పడిపోయింది. దీన్ని తీసేందుకు శుక్రవారం గ్రామానికే చెందిన బత్తిని వెంకటి (51)ని తీసుకెళ్లాడు. విద్యుత్ మోటారు తీసే క్రమంలో ఊపిరాడక వెంకటి మృతిచెందాడు.

పిడుగు గుట్టు.. పసిగట్టు!

- అకాల వర్షాలు.. పిడుగుపాట్లు
- కొన్ని సందర్భాల్లో పోతున్న ప్రాణాలు
- జాగ్రత్తలు తీసుకుంటే బటయపడొచ్చంటున్న నిపుణులు
- పిడుగులపై 'దామిని' ముందస్తు హెచ్చరికలు



ఈ చిత్రంలో శవమై కనిపిస్తున్న ఈయన పేరు రుద్రారపు చంద్రయ్య. ఊరు రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం భరత్‌నగర్. గత ఏడాది మే 16న పొలం పనులకు వెళ్లాడు. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం స్టార్ట్ అయ్యింది. అంతలోనే వ్యవసాయ పనులు చేస్తున్న చంద్రయ్యపై పిడుగు పడింది. ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. ఇంటిపెద్ద హఠాత్తుగా మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. భార్య, ముగ్గురు కూతుళ్లు ఒంటరివారయ్యారు.
–తంగళ్లపల్లి(సిరిసిల్ల)

హుజూరాబాద్:

ప్రకృతి వైపరీత్యాలు.. ఈదురుగాలులు.. ఉరుములు మెరుపులతో కూడిన అకాల వర్షాలు. పిడుగుపాట్లు.. ప్రాణనష్టం.. ఆస్తినష్టం.. ఏడాదిలో ఎప్పుడైనా జరగొచ్చు. ముఖ్యంగా వర్షాకాలనికి ముందు అకాల వర్షాలు ఎక్కువగా పడుతాయి. రైతులు ఇబ్బంది పడుతారు. ఉమ్మడి జిల్లాలో పిడుగుపాటు ఘటనలు అనేకంగానే చోటుచేసుకుంటున్నాయి. ఏటా పిడుగుపాటు మరణాలు పదుల సంఖ్యలో నమోదవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో మూగజీవాలు కూడా పెద్ద సంఖ్యలో చనిపోతున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అటవీ విస్తీర్ణం ఎక్కువ. ఎత్తైన కొండలు, గుట్టలూ ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో సహజంగానే పిడుగులు పడుతుంటాయి. సముద్ర తీరానికి దూరంగా ఉన్న ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. గాలిలో విచ్ఛిన్నత అధికమైన వాతావరణంలో పిడుగులు పడే అవకాశం ఎక్కువని పరిశోధకులు చెబుతున్నారు.

అలర్ట్‌గా ఉంటే మేలు..

పిడుగుపాటును ముందే తెలుసుకోగలిగితే ప్రాణాలు కాపాడుకోవచ్చు. ప్రమాదాన్ని అరగంట ముందే గుర్తించగలిగే ×దామిని¤ మొబైల్ యాప్ ఉంది. పుణే కేంద్రంగా ఉన్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాఫికల్ మెటరాలజీ (ఐఐటీఎం) నాలుగేళ్ల క్రితం దీనిని విడుదల చేసింది. పిడుగుపాటును గుర్తించేందుకు దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో 83 చోట్ల ప్రత్యేక సెన్సర్లు అమర్చారు.

యాప్‌ను ఎలా యూజ్ చేయాలంటే..?

ముందుగా ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ లేదా యాపిల్ యాప్ స్టోర్‌లోకి వెళ్లి..దామిని లైట్నింగ్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. తర్వాత పేరు, మొబైల్ నంబర్, అడ్రస్, పిన్‌కోడ్‌తో రిజిస్టర్ చేసుకోవాలి. జీపీఎస్ లోకేషన్ తెలుసుకోవడం కోసం యాప్‌కు పర్మిషన్ ఇవ్వాలి. మీ ప్రాంతంలో పిడుగు పడే అవకాశం ఉందో లేదో తెలుసుకోవడానికి మూడు రంగులను ఐడెంటిఫికేషన్ కలర్స్ కింద చూపిస్తుంది. వాటి ఆధారంగా మీరు ఉన్న చోట పిడుగు పడే ఛాన్స్ ఉంటే ముందే హెచ్చరిస్తుంది.

రెడ్ కలర్: మీరు ఉన్న ప్రాంతంలో మరో 7 నిమిషాల్లో పిడుగు పడే అవకాశం ఉంటే ఆ సర్కిల్ ఎరుపు రంగులోకి మారుతుంది.

ఎల్లో కలర్: మరో 10–15 నిమిషాల్లో పిడుగుపడే చాన్స్ ఉంటే యాప్‌లోని సర్కిల్ పసుపు కలర్‌లోకి చేంజ్ అవుతుంది.

బ్లూ కలర్: 18–25 నిమిషాల్లో పిడుగు పడే చాన్స్ ఉంటే ఆ సర్కిల్ బ్లూ కలర్‌లోకి మారుతుంది.

జాగ్రత్తలు పాటిస్తే మేలు

- వర్షం కురిసినప్పుడు చెట్ల కింద ఉండొద్దు. పిడుగులు పొడవైన చెట్ల మీద పడే అవకాశమే ఎక్కువగా ఉంటుంది.
- విద్యుత్ సరఫరా అయ్యే పరికరాలకు (విద్యుత్ స్తంభాలు, సెల్ ఫోన్ టవర్లు, బోర్ పంప్ సెట్లు) దూరంగా ఉండాలి. వాటి నుంచి వచ్చే నీటిని కూడా ఆ సమయంలో ఉపయోగించకూడదు.
- బహిరంగ ప్రదేశాలలో పిడుగు పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. పంట పొలాలలో మొబైల్ వాడకూడదు. ఎందుకంటే మొబైల్ నుంచి వచ్చే సిగ్నల్ పిడుగు పడే అవకాశాన్ని ఎక్కువ చేస్తుంది.
- పాడి పశువులను మేతకు బయటికి తీసుకెళ్లకుండా పశువుల పాకలోనే ఉంచాలి.
- నల్లని మబ్బులు ఆకాశం అంతటా విస్తరించి భారీ వర్షం కురుస్తున్నప్పుడు రైతులు పంట పొలాలలో తిరగకుండా ఏవైనా భవనాల కిందే తలదాల్చుకునే లాగా చూసుకోవాలి. ఒకవేళ వారికి అందుబాటులో ఏదైనా భవనం లేకపోతే తాము ఉన్నస్థావరంలోనే మోకాళ్లపై కూర్చొని రెండు చెవులను తమ చేతులతో మూసుకోవాలి.

సూచనలు పాటించాలి



జగిత్యాల అగ్రికల్చర్: ఆకాశం మేఘావృతమై బలమైన ఈదురు గాలులతో వర్షం కురిసే సమయంలో పిడుగులు పడుతుంటాయి. వీటికి అయస్కాంత శక్తితో కూడిన విద్యుత్ శక్తి ఉంటుంది. ఇది విపరీతమైన గాలులు వీచినప్పుడు, మేఘాలలోని మంచు కణాల మధ్య రాపిడి జరిగి ఎలక్ట్రికల్ ఛార్జి విడుదల చేస్తుంది. రెండు మేఘాలు దగ్గరగా వచ్చినప్పుడు మేఘాలలో ఉండే పాజిటివ్ కణాలు బరువుగా ఉండే నెగెటివ్ కణాలను ఆకర్షించుకొని ఆకాశంలో మెరుపులకు దారితీస్తాయి. నెగెటివ్ కణాలు, భూమిలోని పాజిటివ్ కణాలను ఆకర్షిస్తాయి. ఫలితంగా మెరుపులతో పిడుగు పడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతీ సెకండ్‌కు 100కిపైగా పిడుగులు పడుతున్నాయి. ఏటా పిడుగుపాటుకు గురై 24 వేల మంది చనిపోతున్నారు. రెండు లక్షల మందికి పైగా గాయపడుతున్నారు.
– బి. శ్రీలక్ష్మి, వ్యవసాయ వాతావరణ శాస్త్రవేత్త

అలెర్ట్‌గా ఉంటే ప్రమాదాలకు దూరం



వాతావరణంలో మార్పులు జరిగి వర్షాలు పడుతాయన్న సమయంలో బయటికి వెళ్లకుండా పనులు ఆపుకుంటే మంచింది. అత్యవసర పనులు ఉండి బయటికి వెళ్లిన సమయంలో దామిని లైట్నింగ్ యాప్‌ను ఉపయోగించే పిడుగు ఎక్కడ పడుతుందో.. ఏ సమయంలో పడుతుందో పసికట్టవచ్చు. తద్వారా ప్రమాదానికి గురికాకుండా సురక్షితంగా ఉండవచ్చు.
– కనకయ్య, తహసీల్దార్, హుజూరాబాద్

ప్రారంభమైన కల్యాణోత్సవాలు



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు



పీఠాధిపతి విద్యానృసింహ భారతిస్వామికి ప్రసాదాలు అందజేస్తున్న ఏఈవో శ్రీనివాస్



కల్యాణోత్సవం ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

వేములవాడ: రాజన్న ఆలయంలో ఈనెల 6న జరిగే సీతారాముల కల్యాణోత్సవంలో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. శ్రీసీతారామస్వామికి ప్రత్యేక పూజలు, యాగశాలలో హోమాలు నిర్వహించారు.

ఏర్పాట్లు పరిశీలన

ఈనెల 6న నిర్వహించే శ్రీసీతారామచంద్రస్వామి వారి కల్యాణోత్స ఏర్పాట్లను ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. రెండు లక్షలకుపైగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉండడంతో ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. వేములవాడ: రాజన్నను శృంగేరి విరూపాక్ష మఠం పీఠాధిపతి విద్యానృసింహ భారతిస్వామి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం స్వామివారి కల్యాణ మండపంలో ఆలయ అర్చకులు పాదపూజ చేసి ఆశీర్వచనం పొందారు.

రూ. 30 లక్షల ఆదాయం..

రాజన్నను శుక్రవారం 25వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వీరి ద్వారా రూ.30లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు కుర్రం నీలాదేవి, రాంబాబునాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణికుంట్ల ప్రవీణ్ శ్రీరాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వీరికి ఈవో వినోద్‌రెడ్డి పూర్ణకుంభ స్వాగతం పలికారు.

మహనీయుల అడుగుజాడల్లో నడుస్తాం



ర్యాలీగా వస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేములవాడఅర్బన్: మహాత్మాగాంధీ, అంబేడ్కర్ మహనీయుల అడుగుజాడల్లో నడుస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లో జైబాపు.. జైభీమ్.. జై సంవిధాన్ పాదయాత్రను శుక్రవారం తిప్పాపూర్‌లో ప్రారంభించి మాట్లాడారు. దేశ ప్రజలను విడగొట్టాలని బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను ఎండకట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కుల గణనను పూర్తి చేసి దేశంలో రోల్‌మోడల్‌గా నిలిచిందన్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి బిల్లు ఆమోదింపజేసుకున్నామని గుర్తు చేశారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీసీ సంఘం ఆధ్వర్యంలో బీసీ గర్జన నిర్వహించామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో తెల్లరేషన్ కార్డులపై సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. పార్టీ పట్టణాధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్, సాగరం వెంకటస్వామి, బింగి మహేశ్, పుల్కం రాజు, నాగుల విష్ణు, ఎర్రం రాజు ఉన్నారు.

డామిట్.. కథ అడ్డం తిరిగింది

- అక్రమ బంగారం అసలుకే మోసం
- బాధితుడి చిరునామాపై ఆసక్తి
- వేములవాడ ఠాణాలో కేసు నమోదుపై చర్చ



చందుర్తి(వేములవాడ): బంగారం వ్యాపారంతో డబ్బులు సంపాదించాలనే ఆశలు తలకిందులవుతున్నాయి. దుబాయి, సౌదీ అరేబియాల నుంచి బంగారం తీసుకొస్తే కమీషన్ ముట్టజెప్పే ముఠాలకు కొందరు సరఫరాదారులు బురిడీ కొట్టిస్తున్నారు. ఇలాంటి ఘటనలు ఇటీవల జిల్లాలో జరిగాయి. తంగళ్లపల్లి మండలం మండపల్లికి చెందిన ఆసాని రాజు చందుర్తి మండలం సనుగులకు చెందిన పులి శ్రీకాంత్ ద్వారా 10 తులాల బంగారం పంపించాడు. ఎయిర్‌పోర్ట్‌లో కస్టమ్స్ అధికారులు తీసుకున్నారని చెప్పి, 10 తులాల బంగారం ఇవ్వకుండా మోసం చేశారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో మూడు నెలల క్రితం శ్రీకాంత్‌పై తంగళ్లపల్లి ఠాణాలో కేసు నమోదైంది. తాజాగా చందుర్తి మండలం జోగాపూర్‌కు చెందిన బీరయ్య, అనిల్ కలిసి సౌదీ అరేబియా నుంచి హైదరాబాద్ వరకు బంగారం తీసుకొచ్చేందుకు చెరో రూ.లక్ష చొప్పున ఒప్పందం చేసుకున్నట్లు ప్రచారంలో ఉంది. ఎయిర్‌పోర్టు దాటిన తర్వాత మూడో వ్యక్తిగా భావిస్తున్న బీరయ్య బావమరిది మోసం చేసి ఎత్తుకెళ్లాడన్న కోణంలో విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం. ఈక్రమంలో ఎన్గల్‌కు చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

బాధితుడి అడ్రస్‌పై ఆసక్తి

సౌదీ అరేబియా నుంచి ఎంత బంగారం వచ్చింది.. ఎవరూ పంపారన్న విషయాలపై చర్చలు సాగుతున్నాయి. బంగారం బాధితులు ఎక్కడి వారనే విషయాలను పోలీసులు గుట్టువిప్పడం లేదు. వేములవాడకు చెందిన వ్యక్తి కావడంతోనే ఇక్కడి పట్టణ ఠాణాలో కేసు నమోదై ఉంటుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. అయితే నిజాబామాద్ జిల్లా భీంగల్ అని, జగిత్యాల జిల్లా మెట్‌పల్లి, కోరుట్ల, మల్లాపూర్ ప్రాంతాలకు చెందిన వారు.. అనే ప్రచారం సైతం ఉంది. కేసు విచారణ చేస్తున్న పోలీస్ అధికారి మాత్రం విచారణ పూర్తయ్యే వరకు విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

పదుల సంఖ్యలో వ్యాపారులు

అక్రమ బంగారం వ్యాపారం చేసే వారు జిల్లాలో పదుల సంఖ్యలో ఉన్నట్లు ప్రచారంలో ఉంది. విదేశీ బంగారాన్ని కొనుగోలు చేయించి 10, 20 తులాల చొప్పున వ్యాపారం చేయించే వారి సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. కొందరు హైదరాబాద్ కేంద్రంగా ఈ వ్యాపారానికి తెరలేపగా, మరికొందరు మహారాష్ట్ర ప్రాంతం నుంచి దిగుమతి చేసుకుంటున్నారన్న ప్రచారంలో ఉంది.

ప్రభుత్వ బడిలో మేక బలికి యత్నం

- స్థానికులు, మీడియా రావడంతో ఆగిన బలి
- ఉద్యోగుల నుంచి పొంతన లేని సమాధానం
- ఘటనపై ఎటూ తేల్చని విద్యాశాఖ



శివనగర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మేకను పట్టుకున్న వ్యక్తి

సిరిసిల్ల ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని శివనగర్ కుసుమ రామయ్య హైస్కూల్‌లో శుక్రవారం తెల్లవారు జామున మేకను బలి ఇచ్చేందుకు ప్రయత్నించడం కలకలం సృష్టించింది. కొందరు వ్యక్తులు పాఠశాలకు మేకను తీసుకొచ్చిన విషయాన్ని గమనించిన స్థానికులు పలువురికి సమాచారం అందించారు. అక్కడికి స్థానికులతోపాటు మీడియా వెళ్లి చూడగా మేకపిల్లను బలి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న పలువురు కనిపించారు. అక్కడే ఉన్న వారిని ఆరా తీస్తే పొంతన లేని సమాధానాలు చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది. నూతనంగా అదనపు గది నిర్మిస్తుండడంతో సంప్రదాయబద్ధంగా కార్యక్రమం చేశామంటూ ఒకరు, బోరులో నీళ్లు రాకపోవడంతో పూజ చేశామని మరొకరు.. అసలు మేక ఇక్కడికి రావడానికి తమకు సంబంధం లేదని మరొకరు చెప్పడం గమనార్హం. అయితే గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత వెంకన్న అనే ఉద్యోగి స్కూల్ గేట్ తెరవడంతో కొందరు వ్యక్తులు మేకను తీసుకురావడం పలువురు స్థానికులు గమనించి మీడియాకు తెలియజేశారు. అక్కడికి స్థానికులు, మీడియా చేరుకోవడంతో వెంకన్న అనే వ్యక్తి అక్కడి నుంచి జారుకున్నాడు. దీనిపై మండల విద్యాధికారి రఘుపతిని వివరణ కోరగా పాఠశాలలో మేకను బలివ్వలేదన్నారు .మేకను తీసుకొచ్చిన వ్యక్తులకు పాఠశాలకు సంబంధం లేదని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ విషయమై జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు మాట్లాడుతూ పాఠశాలలో ఇలాంటివి జరగడం సరికాదన్నారు. మండల విద్యాధికారి దర్యాప్తు చేపడుతున్నారని.. నివేదిక తర్వాత చర్యలు తీసుకుంటామని తెలిపారు .

భోజన్నపేటలో పేలిన సిలిండర్

పెద్దపల్లిరూరల్: భోజన్నపేట గ్రామంలో శుక్రవారం ప్రమాదవశాత్తు చిన్న వంటగ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో ఇంటి పైకప్పు రేకులు ధ్వంసం అయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామంలో బాలసాని సమ్మయ్య ఇంటి ఆవరణలో హనుమాన్ దీక్షాపరులు భోజనం తయారు చేసుకుంటున్నారు. ఎప్పటిలాగే భోజనం సిద్ధం చేశారు. అయితే, ఏమైందో ఏమోగానీ సిలిండర్ నుంచి గ్యాస్ లీకైంది. దాని సమీపంలోనే తులసి చెట్టు వద్ద దీపమంటుకు గ్యాస్ తోడు కావడంతో సిలిండర్ పెద్దశబ్దంతో పేలి గాల్లోకిఎగిరింది. దీంతో ఇంటిషెడ్డు రేకు ధ్వంసమైంది. సమీపంలో కట్టేసిన ఆవుకు గాయాలయ్యాయి. ఈ సమయంలో అక్కడ ఎవరూ లేకపోడం, సిలిండర్ చిన్నది కావడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్య

మల్యాల(చొప్పదండి): వ్యక్తిగత సమాచార వీడియోను సామాజిక మాధ్యంలో వైరం చేయడంతో అవమానం భరించలేక ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం అర్ధరాత్రి మల్యాల మండలం బలవంతాపూర్‌లోని కాశీనగర్‌లో చోటు చేసుకుంది. మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాశీనగర్‌కు చెందిన షేక్‌బర్కత్‌బీకి చెందిన వ్యక్తిగత సమాచార వీడియోను షేక్ హుస్సేన్ అలియాస్ ఖయ్యూమ్ అనే వ్యక్తి సామాజిక మాధ్యంలో పోస్టు చేసి వైరల్ చేశాడు. దీంతో బర్కత్‌బీ అవమానం భరించలేక గురువారం అర్ధరాత్రి తన ఇంట్లో సుసైడ్ నోట్ రాసి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి నాలుగేళ్ల కుమారుడు, రెండేళ్ల కూతురు ఉన్నారు.

వ్యవసాయ రంగానికి ఊతం

- సాగు సమస్యలపై బృందాలవారీగా చర్చలు
- ముగిసిన ఉత్తర తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సదస్సు



మాట్లాడుతున్న వ్యవసాయ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ డాక్టర్ ఎన్.బలరాం

జగిత్యాలఅగ్రికల్చర్: వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేలా శాస్త్రవేత్తల పరిశోధనలు కొనసాగుతాయని, పంట పెట్టుబడి ఖర్చులు తగ్గించి, రైతుల ఆదాయం పెంచేలా ప్రణాళికలుంటాయని ఉత్తర తెలంగాణ జోనల్‌స్థాయి వ్యవసాయ శాస్త్రవేత్తల సదస్సు అభిప్రాయపడింది. జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో రెండు రోజులపాటు సాగిన ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు, అభ్యుదయ రైతుల సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సదస్సుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ డీన్ ఆఫ్ రిసెర్చ్ డాక్టర్ ఎన్.బలరాం, డీన్ ఆఫ్ ఎక్స్‌టెన్సన్ డాక్టర్ ఏకాద్రి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పంటలవారీగా 10 బృందాలు ఏర్పాటు చేసి.. ఆయా పంటల్లో సమస్యలేమిటి, వాటికి ఎలాంటి పరిష్కారాలను చూపాలనే దానిపై శాస్త్రవేత్తలు, రైతులు బృంద చర్చలు జరిపారు. వరిలో నూక శాతం ఎక్కువ లేని, తక్కువ కాలంలో ఎక్కువ దిగుబడి ఇచ్చే వరి రకాలతోపాటు చలి, ఆకుమచ్చ, ఎండాకు తెగులు, సుడి దోమను సమర్థవంతంగా తట్టుకునే వరి రకాలపై మరింతగా పరిశోధనలు చేయాలనే అభిప్రాయం వచ్చింది. పంటలపై వాతావరణ ప్రభావంపై యూనివర్సిటీ వాతావరణ శాస్త్రవేత్త డాక్టర్ లీలారాణి వివరించారు.



సదస్సుకు హాజరైన రైతులు, శాస్త్రవేత్తలు


గళమెత్తిన రైతులు

ఉత్తర తెలంగాణలోని పది జిల్లాల నుంచి హాజరైన రైతులు పలు సాగు సమస్యలను సదస్సు దృష్టికి తీసుకొచ్చారు. రసాయనాలు లేకుండా పంటలు పండించే పద్ధతులపై పరిశోధనలు చేయాలని కోరారు. కోతుల బెడదతో కష్టపడి సాగు చేసిన పంటలు దెబ్బతింటున్నాయని, వీటిపై ఆలోచనలు చేయాలని కోరారు.

శాస్త్రవేత్తల సమాధానాలు


రైతులు అడిగిన పలు ప్రశ్నలకు శాస్త్రవేత్తలు సమాధానమిచ్చారు. పత్తి పంటను ఎట్టి పరిస్థితుల్లోనూ నవంబర్ వరకు తీసేసి ఇతర పంటను వేసుకోవాలని, లేదంటే గులాబీ పురుగు విజృంభించి నష్టం చేస్తుందని సూచించారు. వరి పంటను అవసరానికి మించి సాగు చేస్తుండటంతో అనేక సమస్యలు వస్తున్నాయని, తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వచ్చే ఇతర పంటల వైపు రైతులు ఆలోచన చేయాలని కోరారు.

రైతులకు అవసరమైన పరిశోధనలకు పెద్దపీట




రైతులకు ఓవైపు సాగులో అవసరమైన సలహాలు, సూచనలందిస్తూ.. మరోవైపు రైతులకు అవసరమైన పరిశోధనలకు పెద్దపీట వేస్తున్నాం. సాగు నీటి సద్వినియోగం, అధిక దిగుబడినిచ్చే విత్త నాలు, పురుగులు, తెగుళ్ల సస్యరక్షణ చర్యలపై విస్తృతంగా పరిశోధనలు చేస్తున్నాం.
– డాక్టర్ ఎన్.బలరాం, వ్యవసాయ వర్సిటీ డీన్ ఆఫ్ రిసెర్చ్

విస్తరణ సేవలను విస్తృతం చేస్తాం



వ్యవసాయంలో వస్తున్న నూతన టెక్నాలజీ, సాగులో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేస్తాం. శాస్త్రవేత్తలు, ఆ యా జిల్లాల వ్యవసాయాధికారులతో సమావేశాలు నిర్వహిస్తాం. శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయి సందర్శన చేయడంతోపాటు అక్కడి రైతులు ఎదుర్కొంటున్న వాటిపై పరిశోధనలు చేసి అండగా ఉంటారు.
– డాక్టర్ ఏకాద్రి, వ్యవసాయ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్

పెట్టుబడి పెరుగుతోంది



వ్యవసాయంలో రోజురోజుకు సాగు పెట్టుబడి పెరుగుతోంది. దీంతో రైతులకు వచ్చే ఆదాయం గిట్టుబాటు కావడం లేదు. తక్కువ కాలంలో అధిక దిగుబడి, అధిక ఆదాయం వచ్చే పంటలపై పరిశోధనలు చేయాలని శాస్త్రవేత్తలకు చెప్పాం.
– ఏలేశ్వరం శేఖర్, అల్లీపూర్, రాయికల్ మండలం